క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



కేటీదొడ్డి: గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ప్రభుత్వం విఫలమైందని, ఏ ఒక్క హామీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం బాసు హనుమంతు నాయుడుకి వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోనేష్, రాము, శేఖర్‌నాయుడు, రాజునాయుడు, తిరుమల్, శ్రీకాంత్, గోవిందు, జగదీష్, వీరారెడ్డి, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా ధరూరు వాసి



మలిచేటి ఆనంద్‌రెడ్డి

ధరూరు: హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా మండల వాసి ఎన్నికపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాపులకుంటకు చెందిన మలిచేటి ఆనంద్ రెడ్డి శుక్రవారం ఎన్నికైనట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఎన్నికపై ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నెట్టెంపాడు నీళ్లు వాగుపాలు



అయిజ: వర్షాలు సంవృద్ధిగా కురిసి నదులకు వరద ఉప్పొంగుతుంటే ఇరిగేషన్ అధికారులు ర్యాలంపాడుకు నీటిని తరలించారు. అక్కడ నుంచి మల్దకల్ మండలంలోని నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి తరలించాల్సి ఉండగా, ఆ నీరు వృథాగా వాగుపాలవుతోంది. నీరు వృథాగా పోవడంతో నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండడంలేదు. దానివల్ల ఆయకట్టు పొలాలకు సాగునీరు లభించకుండా పోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పారిశుద్ధ్యం పడకేసింది



అయిజ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని బింగిదొడ్డిలో పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్లపై మోకాటిలోతు గుంతలు పడడంతో వాటిలో వర్షంనీరు నిలిచిపోయి మురుగు మారింది. దానివల్ల రోడ్లపై కాలినడకన నడిచేందుకు వీలులేకుండాపోయింది. మురుగు ఎక్కువ రోజులుగా నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ఉధృతి ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రత్యేక అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

మేడికొండ రోడ్డుకు మరమ్మతు చేయండి



అయిజ: మండలంలోని మేడికొండ రోడ్డు శిథిలమై సుమారు 10 సంవత్సరాలైంది. అయిజ-పులికల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. మేడికొండ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అయిజ నుంచి 3 కి.మీ. దూరం మాత్రమే డబుల్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మేడికొండ సమీపంలోని రోడ్డు గుంతలు పడింది. కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. కార్లు, ఆటోలు రోడ్డుపై వెళ్లే టప్పుడు వాహనాల కింది భాగంకు రోడ్డు తగలడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాహనా లు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మేడికొండ రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలురైతుకు 'సాగు' కష్టాలు



మానవపాడులో పత్తిపంటను ఎద్దులతో దుక్కిదున్నుతున్న రైతు

- పెరిగిన కౌలు రేట్లు, పెట్టుబడి వ్యయం
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు
- రుణాలివ్వని బ్యాంక్‌లు

మానవపాడు: గుంట సాగుభూమి లేని రైతులు వ్యవసాయంపై మక్కువతో భూమి కౌలు తీసుకొని సాగు చేస్తున్నారు. కౌలు ఒప్పందాలన్ని ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రతి సీజన్‌లో పెట్టుబడి సాయంగా భూమి ఉన్న రైతులకు ఎకరాకు రూ.5వేలు చొప్పున ఏడాదికి రూ.10వేలు బీఆర్ఎస్ ప్రభుత్వం అందించింది. కేంద్రం ఏడాదికి రూ.6వేలు అందిస్తోంది. కౌలు రైతు పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వారికి ఈ పథకాలు వర్తించక పోవడంతో అధికవడ్డీకి అప్పుతెచ్చి పంటలు సాగు చేస్తున్నారు. ఏటేటా కౌలు రేట్లు పెరుగుతుండటంతో మిగులు లేదని కౌలుదారులు వాపోతున్నారు. బోరుబావులు, కాల్వల దగ్గర వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.12వేల నుంచి సుమారు రూ.43వేల దాకా కౌలు యజమానులకు ఇస్తున్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగటంతో దుక్కిదున్నే ట్రాక్టర్ రేటు పెరిగింది. నాటు, కలుపుతీతకు కూలీ రేట్లు పెరగడంతో కౌలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలంపూర్ నియోగకవర్గంలో సాగవుతున్న భూమిలో 50 శాతం పైగా కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. భూసారం తగ్గడం, నకిలీ విత్తనాలు, ఎరువులు, చీడపీడల కారణంగా ఏటా పంట దిగుబడి తగ్గుతున్నది. చేతికొచ్చిన పంటకు మార్కెట్లో సరైన మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారు. పంట రుణాలు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు కౌలు రైతులకు వర్తించడం లేదు. ప్రస్తుతం రైతుబీమా కేవలం పట్టాదారు రైతుల కుటుంబాలకు మాత్రమే అందుతోంది. కౌలు రైతులకు ప్రత్యక్ష పథకాలు అమలు చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.



చెన్నిపాడులో పత్తిపంటను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

కౌలు ధరలు పెరిగాయి..



ఈ ఏడాది కౌలు ధరలు రూ.12వేలకు పెరిగాయి. ఎకరాకు రూ. 13వేల నుంచి రూ.36వేల కౌలుకు పంటను సాగుచేస్తున్నా. నా పొలంతో పాటు 50 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. కౌలు రైతుల కష్టాలు చూసి రైతుబంధు, మద్దతు ధర కల్పించాలి.

– మద్దిలేటి, రైతు చెన్నిపాడు.

రైతుకు పెట్టుబడి భారం



నాకున్న 10 ఎకరాల పొలంతో పాటు 20 ఎకరాలు కౌలు తీసుకున్నా. నియోజకవర్గంలో ఎకరాకు రూ.25వేల నుంచి 40వేలకు పైగా కౌలు రేటు నడుస్తోంది. పంట నష్టం వస్తే రైతుకు రూ.లక్షలో నష్టం వస్తుంది. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నాం.

– నాగేష్, రైతు చెన్నిపాడు.

కనీస మద్దతు ధర చట్టం తేవాలి..



కౌలు రైతులను అదుకునేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం తేవాలి. కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు రాష్ట్రం బోనస్ ఇవ్వాలి. దీంతో పంటసాగుచేసిన కౌలు రైతుకు, భూ యజమానికి మేలు జరుగుతుంది. బ్యాంకుల నుంచి ప్రతి కౌలుదారుడికి పంట రుణాలు అందించి ఆర్థికంగా ఆదుకోవాలి.

– మల్లికార్జున్‌రెడ్డి, రైతు మానవపాడు

అటెన్షన్ ప్లీజ్

వసతిగృహంలో బాత్‌రూం డోర్లు ఏర్పాటు చేయండి



మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ వసతి గృహంలో 120మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు కాలకృత్యాలు, స్నానాలు చేస్తుంటారు. బాత్‌రూంలు, స్నానపు గదులకు డోర్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి బాత్‌రూం, స్నానపు గదులకు డోర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. - మానవపాడు

సంప్రదించవలసిన అధికారి

రామకృష్ణ, హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్, ఫోన్ నెంబర్ 9505282797

ఆదిశిలా క్షేత్రంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, చైర్మన్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శ్రావణ మాసంలో ప్రతి ఏటా నిర్వహించే సప్తాహ భజనల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వారు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, విజయ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, విక్రమసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అజయ్, వెంకటన్న, నరేందర్, మధు, భాస్కర్‌గౌడ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణంలోని 44మంది లబ్ధిదారులకు రూ.15.44లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు మురళి, నరహరి శ్రీనివాసులు, దౌలు, పూడురు కృష్ణ, రిజ్వాన్, రామకృష్ణ, సుదర్శన్, గోవిందు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మొక్కలే మానవాళికి జీవనాధారం

- జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సరిత

మల్దకల్: మొక్కలే మానవాళికి జీవనాధారమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం మల్దకల్‌లో నిర్వహించిన సప్తాహ భజన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిశిలా క్షేత్రంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నర్సింహులు, రామక్రిష్ణ, తిరుమలేష్, రాజశేఖర్‌రెడ్డి, గోవిందు, మల్దకల్, తిమ్మప్ప, గోపాల్, రామచంద్రారెడ్డి, మహబూబ్ అలీ, భాస్కర్‌రెడ్డి, రఘుపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ముగిసిన సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే సప్తాహ భజనలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమాల ముగింపు సందర్భంగా భజన మండలి సభ్యులు గద్వాల పట్టణ సమీపంలోని కృష్ణానది జలాలతో ఆదిశిలా వాసుడికి అభిషేకం చేశారు. అనంతరం భజన మండలి సభ్యులను ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖరరావు, నాగరాజు శర్మ, దీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రం సమీపంలో మొక్క నాటుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

శ్రావణమాసం ప్రత్యేక పూజలు



అయిజ: మండల కేంద్రంలోని రైతులు ప్రతియేటా శ్రవణమాసం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. వర్షాలు సంవృద్ధిగా కురువాలని, పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కట్టకింది తిమ్మప్ప స్వామివారికి శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం మండల కేంద్రంలోని రైతులు ఎద్దులను, ఎడ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఎడ్ల బండ్లను కాడెద్దులకు కట్టుకొని మండల కేంద్రంలోని పెద్ద ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బింగిదొడ్డి చెరువు పక్కన స్వయంబు కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయం వరకు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లారు. యువకులు నందికోళ్ల సేవ నిర్వహించారు. కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు తుంగభద్ర, కృష్ణానది నీటితో అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. స్వామి వారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

వయనాడ్ బాధితులకు అండగా నిలబడదాం



మల్దకల్‌లో విరాళాలను సేకరిస్తున్న సీఐటీయు నాయకులు

మల్దకల్: కేరళలోని వయనాడ్‌లో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు అండగా నిలబడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా వందలాది మంది మరణించడంతో వారి కుటుంబాలకు అండగా ఉందామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధితులకు అండగా నిలబడి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం గ్రామంలో దుకాణాలు, ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంగన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, నాగేష్, తిమ్మోతి, ఆనంద్, రసూల్, నర్సింహ పాల్గొన్నారు.

పోస్టాఫీస్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఉండవెల్లి: పోస్టాఫీసుల్లో అందిస్తున్న వివిధ రకాల పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీసు జిల్లా సహాయ పర్యవేక్షకుడు సైదానాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామ పంచాయతీలో తపాల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సైదానాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకుల కంటే పోస్టాఫీస్ పథకాల్లో వడ్డీ రేటు ఎక్కువ ఉంటుందని, పెన్షనర్లకు, వృద్ధులకు పథకాల్లో ఎక్కువ వడ్డీ రేటు వస్తుందన్నారు. మహిళలకు, చిన్న పిల్లలకు, అన్ని వర్గాల ప్రజలకు పోస్టాఫీస్ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జీవిత బీమా, ప్రమాద బీమా, పాలసీలు అందిస్తుందని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోకేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి, ఉండవెల్లి సబ్ పోస్టాఫీస్ బీపీఎం హిమామ్ వలీ, ఏబీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ జిల్లా సహాయ పర్యవేక్షకుడు సైదా నాయక్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

గద్వాలన్యూటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆ సంఘం సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ అన్నారు. యూటీఎఫ్ ఏర్పడి 50 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం స్థానిక కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్‌గౌడ్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగాన్ని సమైఖ్య పర్చి అన్ని ప్రాంతాల, మేనేజ్‌మెంట్ల, క్యాడర్ల సమైఖ్యసంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఏర్పడిందని తెలిపారు. యూటీఎఫ్ ఏర్పాటు అయిన వెంటనే దేశంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినా లెక్కచేయకుండా ఉపాధ్యాయుల పక్షాన నిలిచిందన్నారు. సీనియర్ నాయకులు స్వామి మాట్లాడుతూ రీగ్రూపింగ్ స్కేల్, పేస్కేల్ పెంపుదలకు, 010 ద్వారా ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపు, కౌన్సిలింగ్ జీఓ సాధన, అప్రెంటీస్ విధానం రద్దు తదితర వాటికి యూటీఎఫ్ అగ్రభాగాన నిలిచి పోరాడిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిప్పన్న, ప్రధాన కార్యదర్శి మునగాల గోపాల్, చక్రధర్, హుస్సేన్, మోహన్‌కుమార్, చిరంజీవి నాయుడుతో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రామన్‌గౌడ్

రొటోవేటర్‌తో దమ్ము.. లాభదాయకం

అలంపూర్: వరిసాగులో అత్యంత ప్రధానమైనది భూమి దమ్ము చేయడం. వరి పొలంలో నీరు నిలబెట్టి బాగా దున్నడాన్ని దమ్ము చేయడమని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచించారు. దమ్ము చేయడం సాధారణంగా కేజ్‌వీల్స్ సహాయంతో చేస్తారు. అలా కాకుండా రొటోవేటర్‌తో దమ్ము చేయడం చాలా లాభసాటిగా ఉంటుందని పేర్కొన్నారు.

కేజ్‌వీల్స్, రొటోవేటర్ వాడకంలో తేడాలు..

కేజ్‌వీల్స్‌తో దమ్ము చేయడం వల్ల భూమిలో లోతు ఏర్పడుతుంది. దీంతో నీరు అధికంగా అవసరమవుతుంది. వేరు వ్యవస్థ సాధారణంగా 20 నుంచి 30 సెంటిమీటర్ల లోతులో ఉంటుంది. కేజ్‌వీల్స్‌తో దమ్ము చేస్తే అడుగు కంటే లోతుకు వెళ్తుంది. దీంతో మొక్కకు పూర్తి స్థాయి పోషకాలు అందవు. రొటోవేటర్‌తో దమ్ము చేస్తే 20 నుంచి 25 సెంటిమీటర్ల కంటే తక్కువ లోతు ఉంటుంది. తక్కువ లోతు వరకే తడి అందాలి కాబట్టి నీరు తక్కువ అవసరం ఉంటుంది. వేరు వ్యవస్థ ఏర్పడే వరకే లోతు ఉంటుంది కాబట్టి పోషకాలు నేరుగా మొక్కకు అందుతాయి. బెడ్ పద్ధతి ఏర్పడుతుంది. దీంతో మొక్క బలంగా తయారవడానికి భూమి దడలుగా మారుతుంది. రొటోవేటర్ ద్వారా దమ్ము చేయడం లాభదాయకం. రోటోవేటర్‌తో దమ్ము చేయడం వల్ల ట్రాక్టర్ ఇంజన్‌పై భారం పడదు. డీజిల్ వినియోగం తగ్గుతుంది. ఈ కారణాల దృష్ట్యా కేజ్ వీల్స్ వాడకాన్ని తగ్గించాలి. కేజ్ వీల్స్‌ను పొలానికి తీసుకొచ్చే సమయంలో తారురోడ్లు పాడవుతాయి. రైతులు కేజ్‌వీల్స్‌కు బదులుగా రొటోవేటర్‌ను వినియోగించాలని సూచించారు.



కేజ్‌వీల్స్‌తో దమ్ము చేస్తున్న రైతు



రోటోవేటర్‌తో దమ్ము చేస్తున్న రైతు

కాడెద్దులతో వర్షం కోసం పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కోటాఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి వర్షం కోసం విరాట పర్వం చేశారు. ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో కోటా ఆంజనేయస్వామి వారి ఆలయం నుంచి డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయం వరకు కాడెద్దులతో విగ్రహాన్ని ఊరేగింపుగా వెళ్లి మరల గ్రామానికి తీసుకొస్తారు. రైతు సంఘం సభ్యులు గోదజయన్న, గోవిందు, శ్రీను, చిన్న నాగేంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాడెద్దులతో స్వామిని ఊరేగిస్తున్న రైతులు

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

మానవపాడు: మండలంలోని పెద్ద ముదాల పాడులో శనివారం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకయ్యింది. దీంతో ఆయా గ్రామాలకు అందాల్సిన మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ఆదివారం కూడా నీరు అందకపోవచ్చని ప్రజలు ఆందోళన చెందుతున్నా రు. వీలైనంత త్వరగా మరమ్మతు చేపట్టి నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



లీకైన మిషన్ భగీరథ పైప్‌లైన్

జాతీయ జెండాను ఎగురవేద్దాం



పంట పొలాల్లో రైతులకు జాతీయ జెండాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు



అయిజలో జాతీయ జెండాను ఎగురవేసిన తాహేర్

అయిజ: ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలను పురష్కరించుకొని ప్రతి భారతీయుడు వారివారి ఇండ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ ఎండీ తాహేర్ కోరారు. శనివారం అయిజ పట్టణంలోని తన ఇంటిపై తన స్నేహితులు, బంధువులతో కలిసి తాహేర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో హనుమంతు రెడ్డి, భగత్‌రెడ్డి, గోపాల కృష్ణ, సిద్ధార్థ, జగపతి రెడ్డి, జైలు, వీరేష్, సురేష్, కిషోర్, ఈరన్న, రమేష్, దామోదర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రతి ఇంటిపై జాతీయపతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదామని వడ్డేపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహ పిలుపునిచ్చారు. తిమ్మాజీపల్లిలో బూత్ అధ్యక్షుడు అయ్యరాజు ఆధ్వర్యంలో త్రివర్ణ పతకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరసింహ మాట్లాడారు. ఈనెల 11నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయపతాకం ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అయిజ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే ఉద్దేశంతో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమ్‌సేన్‌రావు ఆధ్వర్యంలో జాతీయ జెండాల వితరణ కార్యక్రమం ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంటపొలాల్లో పనిచేసుకుంటున్న రైతులకు, కూలీలకు జాతీయ జెండాలను అందజేశారు. హర్‌గర్ తిరంగా పేరుతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99516 02829

మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557

నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785

వనపర్తి జిల్లా: 95539 55603

జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603

నారాయణపేట జిల్లా: 90109 62007

Office mail : advtmbnr@gmail.com